
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

సంగారెడ్డి మెదక్

జిల్లాల వార్తలు

గురువారం 18 సెప్టెంబరు 2025

తూప్రాన్ మండలంలో భారీ వర్షం

తూప్రాన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 10 గంటల వరకు 31.8 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. మండల కేంద్రంలో రోడ్లపై భారీగా వరద నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇమాంపూర్‌లో లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు వచ్చింది. మెదక్ జిల్లాలోనే అత్యధికంగా శివ్వంపేట మండలంలో 69.3 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

సంగారెడ్డి ఐఐటీ, పట్టణంలోని హెచ్ఎండీఏ పరిధిలో చెరువులను

బైక్‌పై తిరుగుతూ పరిశీలించిన జగ్గారెడ్డి, నిర్మల

- రూ.2500 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేస్తే సీఎం రేవంత్‌రెడ్డికి ఇస్తానని అధికారులకు సూచన
- ప్రతీ చెరువు వద్ద 25 మీటర్ల కట్ట వెడల్పు, నెక్లెస్ రోడ్డు, వాకింగ్ ట్రాక్, దోభీ ఘాట్, బతుకమ్మ ఘాట్, లైటింగ్, బోటింగ్, చేపలు పట్టేందుకు తగిన సౌకర్యాలు, చిల్డ్రెన్ పార్కు ఏర్పాటు చేయాలని సూచన
- ఇళ్లు కూల్చకండి.. చెరువులను కాపాడండి
- బలవంతంగా భూములు సేకరించకండి.. రైతులు ఇష్టపూర్వకంగా ఇస్తే తీసుకోండి
- హెచ్ఎండీఏ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులకు చెరువుల వారీగా సూచనలు
- 30 కిలోమీటర్లు బైకుపై నిర్మలతో కలిసి బైక్ ప్రయాణం
- 15 చెరువులను పరిశీలించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి ఐఐటీ, సంగారెడ్డి పట్టణంలోని హెచ్ఎండీఏ పరిధిలోని 15 చెరువుల సుందరీకరణ కోసం బుధవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల బైక్‌పై 30 కిలోమీటర్లు తిరిగి పరిశీలించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు చెరువులను పరిశీలించారు. హెచ్ఎండీఏ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులకు చెరువులవారీగా ఎక్కడికక్కడ జగ్గారెడ్డి సూచనలు చేశారు. రూ.2,500 కోట్లతో చెరువుల సుందరీకరణకు త్వరగా డీపీఆర్‌లు సిద్ధం చేస్తే తాను సీఎం రేవంత్‌రెడ్డికి ఇస్తానని పేర్కొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న జగ్గారెడ్డి



నిర్మలతో కలిసి బైకు నడుపుతూ చెరువుల సందర్శనకు బయల్దేరిన జగ్గారెడ్డి

సాయుధ పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తోంది

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

7వ

త్యాగధనుల కృషితోనే

ప్రజాపాలన సాకారం

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎందరో త్యాగధనుల కృషి ఫలితంగానే సెప్టెంబరు 17న ప్రజాపాలన దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురువేశారు. అనంతరం అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ఎంతోమంది త్యాగధనుల ఫలితంగానే 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ దేశంలో విలీనమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. వేడుకల్లో చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అకట్టుకున్నాయి.



సంగారెడ్డిలో జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం వందనం చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

సృజనాత్మకతకు ప్రతీక విశ్వకర్మ

విశ్వకర్మ భగవాన్ సృజనాత్మకతకు ప్రతీక అని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన విశ్వకర్మ జయంతిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భగవాన్ విశ్వకర్మ జయంతి ఇంజనీర్లు, కళాకారులకు ప్రత్యేకమైన రోజని పేర్కొన్నారు. ఆయన సృష్టికి మొదటి శిల్పిగా, వాస్తుశిల్పిగా, భావిస్తారని, నిర్మాణం, వాస్తుశిల్పం, శిల్పకళ, సాంకేతిక నైపుణ్యాల దేవుడిగా పరిగణిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ వృత్తిదారుడికి తగిన గుర్తింపు ప్రోత్సాహం అందించేందుకు కటుట్టుబడి ఉన్నదని తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా విశ్వకర్మ వర్గాల అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డిలు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ మాధురి, బీసీ సంక్షేమాధికారి జగదీష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపాలన దినోత్సవంలో చిన్నారుల నృత్య ప్రదర్శన



విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

రైతాంగానికి జోహార్లు

- ప్రజాపాలనలో సుఖశాంతులతో జీవనం
- మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి మంత్రి వివేక్ వెంకటస్వామి

మెదక్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రజాపాలన ఆవిర్భావానికి నాంది పలికిన సాయుధ రైతాంగ పోరాటయోధులను ఈ నేల ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుందని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. మెదక్ కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముందుగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుతో కలిసి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండా ఎగరవేశారు. ఎస్పీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబరు 17 తెలంగాణ చరిత్రలోనే కీలకమైన రోజని పేర్కొన్నారు. నిజాం రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమం తీవ్రతరం చేసిందని పేర్కొన్నారు. నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, హోంమంత్రి పటేల్ నేతృత్వంలో పోలీసు చర్య ద్వారా 1948 సెప్టెంబరు 17న హైదరాబాద్ సంస్థానం దేశంలో విలీనమయ్యిందని తెలిపారు. ప్రస్తుతం సీఎం రేవంత్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఒకటొకటిగా అమలు చేస్తున్నామన్నారు.



మెదక్ కలెక్టరేట్‌లో జెండా ఎగరవేసిన ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి తదితరులు

జిల్లా సమగ్రాభివృద్ధి

మెదక్ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నామని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, మహిళా శిశుసంక్షేమం, రోడ్లు, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీలు, మున్సిపాలిటీలు, వాటర్ సప్లై, వెటర్నరీ తదితర శాఖల్లో విప్లవాత్మకమైన అభివృద్ధి సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం, గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల, నర్సింగ్ కలాశాలలను ప్రారంభించామని, వాటికి నూతన భవనాల నిర్మాణానికి రూ.206 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. మెదక్ చర్చి అభివృద్ధికి రూ.29.18 కోట్లు, ఏడుపాయల అభివృద్ధికి రూ.35 కోట్లు రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, ఆవుల రాజిరెడ్డి, సుప్రభాత్‌రావు, లక్ష్మీనారాయణ గౌడ్, బొజ్జ పవన్‌కుమార్, ఆవుల గోపాల్‌రెడ్డి, గూడురు ఆంజనేయులు, మ్యాడం బాలకృష్ణతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వరద సాయం రూ.10 కోట్లు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాకు తక్షణ వరద సాయం కింద రూ.10 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన వివిధ శాఖల జిల్లా అధికారులతో వరద నష్టం అంచనాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి జిల్లాను సాధారణ స్థితికి తెచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. రవాణా మార్గాలను పునరుద్ధరించడానికి ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇతర శాఖల నష్టాన్ని అంచనా వేసి అవసరమైన నిధులను విడుదల చేయిస్తామని చెప్పారు. యుద్ధప్రాతిపదిక మర్మమతు పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో భుజంగరావు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి వివేక్

న్యాయవాదుల రక్షణకు

ప్రత్యేక చట్టం చేయాలి

సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువరన్‌రెడ్డి

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టం కోసం సంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో మూడు రోజుల నిరాహార దీక్షలను బుధవారం ప్రారంభించారు. అంతకుముందు జిల్లా కేంద్రంలో న్యాయవాదు భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ప్రతీ ఒక్కరు ఖండించాలని కోరారు. న్యాయవాదుల రక్షణ చట్టం అమలు కోసం ఏ ప్రభుత్వం చొరవ తీసుకోవడం లేదని ఆరోపించారు. కోర్టులో గెలుపోటములు సహజమని, కానీ కేసు ఓడిపోతే దానికి న్యాయవాదే కారణమంటూ కొందరు కక్ష పెంచుకొని భౌతికదాడులకు పాల్పడుతున్నారని అన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం కోసం తాము అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదని విమర్శించారు. సమాజంలో న్యాయవాది పాత్ర ఎంతో కీలమైందని, దాడుల వల్ల న్యాయవాదులు మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి న్యాయవాదుల రక్షణచట్టం అమలు చేయాలని, లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.మహేష్, సీనియర్ న్యాయవాది సుధాకర్, సుభాష్‌చందర్, భాస్కర్, రాములు, గోవర్ధన్, సతీష్, తదితరులు పాల్గొన్నారు. న్యాయవాదుల దీక్షలకు వివిధ పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు సంఘీభావం ప్రకటించారు.



సంగారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు



అమ్మో.. సంగారెడ్డి జైలు

ఖైదీలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా పట్టించుకోని అధికారులు

- న్యాయధికారులు తనిఖీలు చేసినా ఫలితం శూన్యం
- రెండ్రోజులు క్రితం ఇద్దరు ఖైదీల ఆత్మహత్యాయత్నం
- గుట్టుచప్పుడు కాకుండా ఆస్పత్రికి తరలింపు

కంది, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కంది సమీపంలో సంగారెడ్డి సెంట్రల్ జైలు వివాదాస్పదంగా మారుతోంది. జైలు లోపల ఖైదీలు ఎలాంటి పరిస్థితుల్లో ఎదుర్కుంటున్నారో బయటకు పొక్కకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఖైదీలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా గుట్టుచప్పుడు కాకుండా ఆస్పత్రికి తరలిస్తున్నారని విమ్మర్శలు వస్తున్నాయి. రెండు రోజుల క్రితం ఇద్దరు రిమాండ్ ఖైదీలు సీసా పెంకులు మింగామని చెబుతూ ఆత్మహత్య యత్నానికి పాల్పడడమే ఇందుకు నిదర్శనం. న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు ప్రతీ నెలా తనిఖీలు చేస్తున్నా భయంతో ఖైదీలు ఏమీ చెప్పడం లేదని తెలుస్తున్నది. గతంలోనూ ఖైదీలతో కూరగాయలు అమ్మిస్తున్న, అంబులెన్స్ డ్రైవర్లుగా, ఆఫీస్‌బాయ్‌లుగా వినియోగించిన విషయాన్ని 'ఆంధజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చింది.

ఖైదీల ఆత్మహత్యా యత్నం

రెండు రోజుల క్రితం సంగారెడ్డి సెంట్రల్ జైలులో ఇద్దరు రిమాండ్ ఖైదీలు సీసా పెంకులు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డామని చెప్పడంతో రాత్రికి రాత్రే సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎక్స్‌రే తీసిన వైద్యులు ఖైదీలు సీసా పెంకులు కాదని, పెన్ను మూతని చెప్పినట్లు జైలు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం వారు డిశ్చార్జ్ అయ్యారని, బాగానే ఉన్నారని జైలు అధికారులు వెల్లడించారు.

ఖైదీలతో వెట్టిచాకిరీ

సంగారెడ్డి సెంట్రల్ జైలులో ఖైదీలతో నిబంధనలకు విరుద్ధంగా వెట్టిచాకిరీ చేయిస్తున్నట్లు తెలుస్తున్నది. జైలు అధికారుల క్వార్టర్స్‌లో రోజు పారిశధ్య పనులు, జైలు కార్యాలయంలో చాయ్‌లు అందించడం, బాత్‌రూమ్‌లు శుభ్రం చేయిండం, సంతల్లో కూరగాయలు అమ్మించడం, అంబులెన్స్ డ్రైవర్లుగా వినియోగించడం వంటి పనులు చేయిస్తున్నారని ఆరోపణలున్నాయి. సంగారెడ్డి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఓపెన్ జైలు ఖైదీలతో తోట పనులు, కూరగాయలు పండించడం, జైళ్లశాఖ పెట్రోల్ బంకుల్లో పని చేయించడం వంటివి చేయించేవారు. ఇప్పుడు రిమాండ్ ఖైదీలతో కూడా అన్ని పనులు చేయిస్తున్నట్లు తెలుస్తుంది. గత కొన్ని నెలల క్రితం సంగారెడ్డి సెంట్రల్ జైలు ఖైదీలు కంది సంతంలో

2022 జనవరిలో వరకట్న వేధింపుల కేసులో వరంగల్ జిల్లా పర్వతగిరికి చెందిన భానుచందర్ హైదరాబాద్‌లో కోర్టు నుంచి సంగారెడ్డి జైలుకు రిమాండ్ ఖైదీగా వచ్చాడు. నెల కూడా గడవక ముందే ఫిబ్రవరి 14న బెడ్‌షీట్ చింపి దానితో బాత్‌రూమ్‌లోని వెంటిలేటర్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని జైలు అధికారులు తెలిపారు. జైలు లోపల ఇంత భద్రత ఉన్నా బెడ్‌షీట్‌తో ఖైదీ ఉరి వేసుకోవడం అప్పట్లో పలు అనుమానాలకు తావిచ్చింది.

2025 ఏప్రిల్ 3న మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన ఇజ్మల వెంకట్ గంజాయి కేసులో అరెస్టయి సంగారెడ్డి సెంట్రల్ జైలుకు రిమాండ్ ఖైదీగా వచ్చాడు. అదే నెల 18న ఫిట్స్ వస్తే ఆస్పత్రికి తరలించే లోపే గుండెపోటుతో మృతి చెందాడని జైలు అధికారులు తెలిపారు. ఆయన మృతిపై సందిగ్ధం ఇప్పటికీ వీడలేదు.

మిగతా 8వ పేజీలో



గురుకులంలో విద్యార్థినిని పరీక్షిస్తున్న వైద్యాధికారిణి

గురుకులాల్లో ఆరోగ్య శిబిరాలు

900 మంది బాలికలకు వైద్య పరీక్షలు

రామయంపేట, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకులం, బాలికల డిగ్రీ కళాశాల హాస్టల్‌లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. 'గురుకులంలో విష జ్వరాలు' శీర్షికతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళ, బుధవారాల్లో ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డా.హరిప్రియ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించి 900 మంది బాలికలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. జ్వరాలతో బాధపడుతున్న పలువురు బాలికలను మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వాతావరణ మార్పులతో ఐదు రోజులుగా విద్యార్థినులు జ్వరంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్న నేపథ్యంలో వైద్య శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థినులకు ఆరోగ్య సమస్యలుంటే తమకు సమాచారం ఇవ్వాలని గురుకులం, హాస్టల్ ప్రిన్సిపాళ్లకు సూచించారు. వారి ఆరోగ్య పరిరక్షణకు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

తరగతి ఇంతేనా?

- అధ్వాన స్థితిలో సర్కారు చదువులు
- శిథిలావస్థలో గడిపెద్దాపూర్ బడి
- జిన్నారం ఎస్టీ గురుకులంలో ఒకే చోట పాఠశాల, కళాశాల
- పుల్లూరు బడిలో మద్యం సీసాలు

7

బైరాన్‌పల్లిని స్మారక కేంద్రంగా ఏర్పాటు చేస్తాం

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- వీరబైరాన్‌పల్లిగా గెజిట్ కోసం ప్రభుత్వం దృష్టికి
- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి


అమరవీరుల కుటుంబాలను సన్మానిస్తున్న ఎంపీ చామల

మద్దూరు/సిద్దిపేట సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బైరాన్‌పల్లి వీరుల త్యాగం ఎనలేనిదని, ఇక్కడ స్మారక కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బైరాన్‌పల్లి ప్రత్యేక పాలన వ్యవస్థ ఏర్పాటు చేయడంతోపాటు ఒకరోజు ప్రత్యేకంగా సీఎంను తీసుకొచ్చి అమరవీరులకు నిజమైన శ్రద్ధాంజలి ఘటించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. దూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి బురుజు, అమర వీరుల స్థూపం వద్ద మంత్రి పొన్నం, ఎంపీ చామల జాతీయ జెండాను ఎగురవేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ బండి శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అమరవీరుల విమోచన దినోత్సవ సభలో మాట్లాడారు. తెలంగాణ అస్తిత్వాన్ని, కళాకారుల్ని, సంస్కృతిని, అమరవీరులను, తెలంగాణ నీళ్లు, నిధులు, నియామకాలపై ప్రత్యేకమైన శ్రద్ధతో ప్రజాపాలన కొనసాగిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పాటు, కేసీఆర్ సీఎం అయ్యాక నీళ్లు, నిధులు నియామకాలు కేవలం ఆయన కుటుంబానికి మాత్రమే వచ్చాయని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. నిజాంకు కేసీఆర్‌కు ఏ మాత్రం తేడా లేదని తెలిపారు. వీరబైరాన్‌పల్లిగా నామకరణం చేసి గజిట్ కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అమరుల స్థూపం, బురుజు అభివృద్ధికి తన నిధుల ద్వారా రూ.10 లక్షలు త క్షణమే అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబాలను పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి గిరి కొండల్‌రెడ్డి, నాయకులు, పలువురు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులు వెనక్కి తగ్గాలి

ఆరోగ్య శ్రీ సేవల నిలిపివేతపై ప్రైవేట్ ఆస్పత్రులు వెనక్కి తగ్గాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. బుధవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ నిలిపివేయడం వల్ల పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మానవీయ కోణంలో ఆలోచించి, ఆరోగ్య శ్రీ సేవలు పునరుద్ధరించాలని సిద్దిపేట జిల్లాకు సంబంధించి ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు.

ఆవంచ, రెడ్డిపల్లిలో ఉత్తరప్రదేశ్ సర్పంచుల బృందం పర్యటన


ఉత్తరప్రదేశ్ బృందాన్ని సన్మానిస్తున్న నాయకులు

నర్సాపూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆవంచ, రెడ్డిపల్లి గ్రామాల్లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన సర్పంచులు, అధికారుల బృందం బుధవారం పర్యటించింది. స్థానిక నాయకులు బృందానికి ఘనంగా స్వాగతం పలికడమే కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. రాష్ట్రంలోని పంచాయతీ వ్యవస్థతో పాటు గ్రామాల అభివృద్ధి, సంక్షేమాల అమలు తీరును క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. స్థానిక ఎంపీడీవో మధులత ఆధ్వర్యంలో ఇక్కడి స్థానిక అధికారులు గ్రామంలో అమలవుతున్న పనులు, సంక్షేమ పథకాలను వారికి వివరించారు. రెడ్డిపల్లిలో బృందాన్ని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ ఉపసర్పంచ్ అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

పండుగకు ఊరెడుతున్నారా.. జాగ్రత్త

కాలనీలవాసులకు పోలీసుల సూచనలు


ప్రచార ఆటోను ప్రారంభిస్తున్న అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్

అమీన్‌పూర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : దసరా వచ్చిందంటే పట్టణాల నుంచి గ్రామాలకు పెద్ద వలసలు సర్వసాధారణం. కాలనీల్లోని ఇళ్లకు తాళాలు వేసి పిల్లాపాపలతో కుటుంబం సహా గ్రామాలకు వెళ్లిపోతారు. తాళం వేసిన ఇళ్లను చూస్తే దొంగలకు మాత్రం దసరా పండగ ముందే వచ్చినందత సంబరం. ప్రజల్ని అప్రమత్తం చేయడంలో భాగంగా పలు కీలక సూచనలు చేస్తున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాలనీల్లో ఆటోను ప్రచారం కోసం రగంలోకి దింపారు. కాలనీలలో తిరుగుతూ ప్రజల్ని అప్రమత్తం చేయడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని ఇన్‌స్పెక్టర్ నరేష్ పేర్కొన్నారు.

ఇంద్రేశంలో పట్టపగలే చోరీ

- 20 తులాల బంగారు నగలు, 4 కేజీల వెండి అపహరణ

పటాన్‌చెరు సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భార్యాభర్తలు డ్యూటీకి వెళ్లిన తర్వాత ఇల్లుగుల్ల చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ వినాయకరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామం పీఎస్ఆర్ కాలనీ తుల్జాభవాని ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న పవన్‌కుమార్ హైటెక్‌సిటీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. భార్య గౌరీ ప్లేస్కూల్‌లో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. విధుల్లో భాగంగా మంగళవారం భార్యాభర్తలు డ్యూటీలకు వెళ్లారు. సాయంత్రం 4 గంటలకు భార్య గౌరీ ఇంటికి వచ్చి ఇంటి ప్రధాన ద్వారం తాళాలు పగలకొట్టి కనిపించాయి. పడక గదిలోని బీరువా తెరిచి ఉన్నది. అందులోని బంగారు చైన్‌లు, ఉంగరాలు, నెక్లెస్, చెవిరింగులు, బ్రాస్‌లెట్, నల్లపూసల చైన్‌లు దాదాపు 20 తులాల బంగారం చోరీకి గురైంది. అలానే 4కేజీల వెండి, రూ.8వేలు నగదు దొంగలు తీసుకువెళ్లారు. ఈ మేరకు బుధవారం పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నాలుగేళ్ల క్రితం తండ్రి.. ఇప్పుడు తల్లి మృతి

- అనాథలైన ఇద్దరు పిల్లలు


మృతదేహం వద్ద రోదిస్తున్న రేణుక, విష్ణు

గజ్వేల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తండ్రి నాలుగేళ్ల క్రితం మృతిచెందగా, తాజా తల్లి మృతిచెందడంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారిన సంఘటన గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మిందె గౌరయ్య, మిందె మనీలా(38)కు రేణుక(15), విష్ణు(12) ఇద్దరు సంతానం. నాలుగేళ్ల క్రితం గౌరయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. ప్రైవేటు హోటళ్లో కూలీ పని చేసుకుంటూ మనీలా ఇద్దరు పిల్లలను పోషిస్తున్నది. పని ప్రదేశంలో నెల రోజుల క్రితం కరెంట్ షాక్ తగిలిన మనీలా మృత్యువుతో నెల పాటు పోరాడింది. తీవ్ర గాయాలతో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూసింది. బుధవారం ఉదయం మనీలా మృతదేహాన్ని కొడకండ్లకు తీసుకురావడంతో గ్రామంలో రోదనలు మిన్నంటాయి. మనీలాకు గత ప్రభుత్వం ఇచ్చిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మినహా ఎలాంటి ఆస్తులు లేకపోవడం, అటు గౌరయ్య, ఇటు మనీలాలకు తల్లిదండ్రులు లేకపోవడంతో వారి ఆలనపాలనా చూసుకునే వారు లేకుండా పోయారు. గ్రామస్థులు తలా కొంత చొప్పున డబ్బులు వెచ్చించి మనీలా అంత్యక్రియలు పూర్తి చేశారు.

అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య


రవి (ఫైల్)

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కలిసి రాకపోవడం, ఆర్థిక ఇబ్బందులు, పెరిగిపోయిన అప్పుల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకుని బలన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని కామారం తండాలో బుధవారం జరిగింది. తండాకు చెందిన దేవసోత్ రవి(44) వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. తన ఇంటి నిర్మాణం కోసం, వ్యవసాయ పెట్టుబడి అవసరాల నిమిత్తం ఓ బ్యాంకులో పొలాన్ని తాకట్టు పెట్టి రూ.5 లక్షల రుణాన్ని తీసుకున్నాడు. ఈ అప్పులు తిరిగి చెల్లించే మార్గం కనిపించకపోవడంతో మనోవేదనకు గురై బుధవారం తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

కూలీగా వచ్చి గంజాయి అమ్మకం

- 1.350 కిలోల సరుకు స్వాధీనం

తూప్రాన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కూలీ పనులు చేస్తూ గంజాయి విక్రయిస్తున్న ఒకరిని మనోహరాబాద్ ఎక్సైజ్ ట్రాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం వలపన్ని పట్టుకున్నారు. తూప్రాన్‌లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన ముఖేశ్ కుమార్ మండల్(29) మనోహరాబాద్ మండల కేంద్రంలో ఎస్ఎస్ఏఎఫ్ కోల్డ్ స్టోరేజీ కంపెనీలో కూలీగా పనులు చేస్తున్నాడు. బీహార్ నుంచి ఎండు గంజాయి తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడి చేసి నిందితుడిని పట్టుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి, నిందితుడి నుంచి 1.350 కిలోల ఎండు గంజాయిని, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని నర్సాపూర్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో అప్పగిస్తున్నట్లు వివరించారు.

కొమురవెల్లి శివారులో గంజాయితో పట్టుబడ్డ వ్యక్తి..

కొమురవెల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి శివారులోని దాచారం గుట్ట సమీపంలో హైదారాబాద్ చింతల్‌కు చెందిన కుంభ భూమరాజు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు బుధవారం పట్టుకున్నారు. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, కొమురవెల్లి ఎస్ఐ రాజుగౌడ్ నిందితుడిని అదుపులోకి తీసుకుని 195 గ్రాముల గంజాయిని, సెల్‌ఫోన్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. కాపర్ వైర్ అపహరణ

చేర్యాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ముస్త్యాల గ్రామ శివారులోని సలాక్ పూర్ క్రాస్‌రోడ్డు సమీపంలో అంజయ్య వ్యవసాయబావి వద్ద 25కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులో నుంచి కాపర్‌వైర్‌ను అపహరించుకుపోయారు. బుధవారం ఉదయం గమనించిన స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించగా, విద్యుత్ పునరుద్ధరణకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు.

ఇద్దరి అదృశ్యం

పటాన్‌చెరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన కేసులు నమోదయ్యాయి. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు అంబేద్కర్ కాలనీలో నివాసం ఉంటున్న మమతకుమారి మంగళవారం ఉదయం కిరాణా దుకాణానికి వెళ్లి సరుకులు తెస్తానని బయటకు వెళ్లారు. సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. భర్త సంతోష్‌పాశ్వాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి గ్రామ విజేత కాలనీలో నివాసం ఉంటున్న రామ్‌లాల్ నాయక్ మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. భార్య మీరాబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



సంగారెడ్డిలో

పోలీస్ కార్యాలయాల్లో ప్రజాపాలన దినోత్సవం

సెప్టెంబరు 17ను పురస్కరించుకుని బుధవారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల పోలీస్ కార్యాలయాల్లో ఎస్పీలు పరితోష్ పంకజ్, డీవీ శ్రీనివాసరావులు జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుశాల్కర్ జెండా ఎగురవేశారు. ఆయా చోట్ల వారితో పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

-మెదక్ అర్బన్/సంగారెడ్డి క్రైం/సిద్దిపేట క్రైం




సిద్దిపేటలో..

తర'గతి' ఇంతేనా?

సర్కారు చదువులు అధ్వాన స్థితిలో కొనసాగుతున్నాయి. ఓ ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరుకుని తరగతి గదులు సరిపోకపోవడంతో చెట్ల కింద, వరండాల్లో చదువులు సాగుతుంటే.. మరో బడిలో విద్యార్థులు ఉదయం వచ్చేసరికి ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.. ఇక ఓ గురుకుల విద్యాలయంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు ఇరుకు గదుల్లో, సరైన వసతి లేక అగచాట్లు పడుతున్నారు.

అధ్వాన స్థితిలో సర్కారు చదువులు

శిథిలావస్థలో గడిపెద్దాపూర్ బడి

జిన్నారం ఎస్టీ గురుకులంలో ఒకే చోట పాఠశాల, కళాశాల

పుల్లూరు బడిలో మద్యం సీసాలు

అల్లాదుర్గం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ ఉన్నత పాఠశాల 65 ఏళ్ల క్రితం నిర్మింపచేసిన పాత భవనంలోనే ఇంకా కొనసాగుతున్నది. విద్యార్థుల సంఖ్య పెరిగినా, అదనపు గదులను మాత్రం నిర్మించకపోవడంతో తరగతులు నిర్వహించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్న వాటిలోనే,


గడిపెద్దాపూర్‌లో పాతబడిన ఉన్నత పాఠశాల

65 ఏళ్ల పాతభవనంలో..

ఇరుకు గదుల్లోనే ఉపాధ్యాయులు బోధిస్తుండగా, శిథిలావస్థలో ఉన్న భవనంలో విద్యార్థులు భయం, భయంగా పాఠాలు వింటున్నారు.

చెట్ల కింద, వరండాల్లో...

గడిపెద్దాపూర్ పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్ మీడియం కొనసాగుతున్నది. బడిలో ఉపాధ్యాయుల కొరత లేకపోయినప్పటికీ, వసతుల లేమితో నానా పాట్లు పడాల్సి వస్తున్నది. పాఠశాలలో 225 మంది విద్యార్థులుండగా కేవలం మూడు తరగతి గదులు మాత్రమే ఉండటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వరండాలో, చెట్ల కిందనే తరగతులు కొనసాగుతున్నాయి. 65 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం పైకప్పు రేకులతో శిథిలావస్థలో ఉన్నది. పదేళ్ల క్రితం ప్రభుత్వం అదనంగా మూడు తరగతి గదులను నిర్మింపచేయగా ఈ భవనంలోని ఓ తరగతి గదిలో గత ఆదివారం పైకప్పు పెచ్చులూడి కింద పడింది. రేకులషెడ్డులో కొనసాగుతున్న ఇతర తరగతి గదులు గోడలు ఎప్పుడు కూలిపోతాయోననే స్థితిలో ఉన్నాయి. గతంలో ఓ తరగతి గది పూర్తిస్థాయిలో కూలిపోయింది. అధికారులు స్పందించి నూతన భవనం నిర్మింపజేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



శిథిలావస్థలో ఉన్న ఈ పాఠశాల భవనంతో పొంచిఉన్న ప్రమాదంపై తాము ఉన్నతస్థాయి అధికారులకు విన్నవించాం. పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలు, తరగతి గదుల కొరతపై వివరించాం. ఈ నెల 14న పాఠశాల తరగతి గది పైకప్పు పెచ్చులు ఊడికింద పడటంతో విద్యార్థులు సైతం భయాందోళన చెందుతున్నారు.

- నర్సింహులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు



జిన్నారంలో గల ఎస్టీ గురుకుల పాఠశాల

విశాల ప్రాంగణం ఉన్నా..

జిన్నారం, సెప్టెంబరు 17, (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన జిన్నారంలోని ఎస్టీ గురుకుల విద్యాలయానికి 30 ఎకరాల విశాల ప్రాంగణం ఉన్నది. కానీ, పాఠశాల కోసం నిర్మించిన భవనంలోనే జూనియర్ కళాశాల కూడా కొనసాగుతుండడంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పటం లేదు. ఎస్టీ గురుకుల పాఠశాలకు 2017లో జూనియర్ కళాశాల మంజూరు కాగా, నాటి నుంచి ఒకే చోట తరగతులు నిర్వహిస్తూ వసతి గృహ సౌకర్యం కల్పించారు.

అదనపు భవనాలు నిర్మిస్తే కళాశాల, పాఠశాల నిర్వహణకు సౌకర్యంగా ఉంటుంది. జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 160 సీట్లకు 67 మంది విద్యార్థులు, ఇక పాఠశాలలో 480 మందికి 463 విద్యార్థులు ఉన్నారు. 8 ఏళ్లుగా పాఠశాల భవనాల తరగతి గదులనే జూనియర్ కళాశాల కోసం వినియోగిస్తుండగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇక్కట్లు తప్పటం లేదు. కళాశాలకు ప్రత్యేకంగా ల్యాబ్ సౌకర్యం లేదు. ప్రస్తుతం ఉన్న వసతి గృహాలు పాఠశాల విద్యార్థులకే సరిపోతుండగా, కళాశాల విద్యార్థులు అక్కడే ఉండటంతో ఇరుకుఇరుకుగా కాలం వెల్లదీస్తున్నారు. పాఠశాలలో 27 మంది, కళాశాలలో ఏడుగురు అధ్యాపక సిబ్బందితో కలిపి మొత్తం 40 మంది వరకు ఉండగా వీరు ఉండటానికి వసతి గృహాలు పూర్తిస్థాయిలో లేవు. కేవలం పది మంది వరకు ఉండే వీలుగా క్వార్టర్స్ ఉండగా, ఇతర సిబ్బంది ఇక్కట్ల మధ్యే రాకపోకలు సాగిస్తున్నారు. స్థానికంగా ఉన్న పరిశ్రమల సీఎస్ఆర్ నిధుల వినియోగంతో అదనపు భవనాలు నిర్మించి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

ఒకే చోట సర్దుబాటు

గురుకుల పాఠశాల, కళాశాలలకు తరగతి గదులను సర్దుబాటు చేసి ఒకే చోట నిర్వహిస్తున్నాం. అదనపు గదుల నిర్మాణానికి ఇప్పటికీ ప్రతిపాదనలు పంపించాం. సీఎస్ఆర్ నిధుల మంజూరుకు ఎమ్మెల్యే, గురుకుల విద్యాధికారుల దృష్టికి తీసుకెళతాం.

- వెంకటయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్


చెట్లకింద 8, 9, 10వ తరగతి విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులు

పుల్లూరు పాఠశాలలో మద్యం సీసాలు

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా సిద్దిపేట రూరల్ మండలంలో మందుబాబుల ఆగడాలకు హద్దులేకుండా పోతున్నది. ఏకంగా పాఠశాలలోనే మద్యం సేవిస్తున్నారు. పుల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు మద్యం తాగి, ఖాళీ సీసాలను విచ్చలవిడిగా పడేసి వెళ్లారు. ఉదయం విద్యార్థులు పాఠశాలకు వచ్చేసరికి ఖాళీ సీసాలు దర్శనమిస్తున్నాయి. పాఠశాలను దేవాలయంలా చూసుకోవాల్సింది పోయి.. అదే పాఠశాలలలో మద్యం సీసాలు, వాటర్ బాటిళ్లు, సిగరేట్ పీకలు పడవేయడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మద్యం సేవించిన వారి పై చర్యలు తీసుకోవాలని, రాత్రి సమయంలో పోలీసు పెట్రోలింగ్ పెంచాలని గ్రామస్థులు కోరుతున్నారు.


పుల్లూరు ప్రభుత్వ పాఠశాలలో ఖాళీ మద్యం సీసాలు

సాయుధ పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తోంది

● సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ పోరాటాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ వక్రీకరిస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట మహాసభను బుధవారం సంగారెడ్డిలో నిర్వహించారు. సీపీఎం నాయకులు పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహం నుంచి పాతబస్టాండ్ మీదుగా పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మహాసభలో రాఘవులు మాట్లాడుతూ తెలంగాణ తెలంగాణ సాయుధ పోరాటాన్ని విమోచన దినంగా నిర్వహించడం సిగ్గుచేటన్నారు. నైజాం, బీజేపీ విధానాలు ఒక్కటేనని, తాము నైజాం వారసులమని బీజేపీ నాయకులు ప్రకటించుకుంటే సరిపోతుందని ఎద్దేవా చేశారు. ఆనాడు బ్రిటీష్ వారికి తొత్తులుగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు పనిచేసినట్టు చరిత్రనే చెబుతున్నదన్నారు. ప్రజల్లో మత విద్వేశాలను రెచ్చగొట్టి, తమ ఎజెండాను అమలు చేసుకునేందుకు అనేక రకాలుగా ప్రయత్నిస్తున్నదని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు మాట్లాడుతూ నాటి గెరిల్లా యుద్ధ చరిత్రను నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్రీకరిస్తూ హిందూ, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా నమ్మించేందుకు కుట్రలు చేస్తుందన్నారు. చరిత్రను రాజకీయ లబ్ధి కోసం మార్చే కుట్రలను ప్రజలు గుర్తించి తిరగబడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు మల్లికార్జున్, సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యాదగిరి, ప్రవీణ్‌కుమార్, విద్యాసాగర్, నాగేశ్వర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

● రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ సంచాలకుడు గాజర్ల రమేష్

కొండపాక, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రాథమికస్థాయి నుంచే విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన సాగితే ఆలోచన శక్తి పెరుగుతుందని, వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేలా ఉపాధ్యాయుల కృషి ఉండాలని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ సంచాలకుడు, సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి గాజర్ల రమేష్ పేర్కొన్నారు. కొండపాక మండలం సిరసనగండ్ల ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు చేస్తున్న బోధనను విద్యార్థుల స్థాయిని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో పి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. పాఠశాలలోని మూడు, నాలుగు, ఐదో తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు అడగగా, సమాధానాలు చక్కగా చెప్పడంతో వారికి ఆయన చిరు కానుకలను అందజేశారు. పాఠశాలలో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్‌కు సంబంధించిన విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలను తన సొంత ఖర్చులతో అభివృద్ధి పరచిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయప్రకాష్‌రెడ్డి అభినందించాడు. ఉపాధ్యాయుల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశాడు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికలు


రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

మెదక్ అర్బన్/పాపన్నపేట, సెప్టెంబరు 17 : మెదక్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాపన్నపేటలో నిర్వహించిన అండర్-16 కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపిన పలువురు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కాంప్లెక్స్ హెచ్ఎం మహేశ్వర్ పోటీలను ప్రారంభించగా జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ చూపిన బాలబాలికలను 12 మంది చొప్పున 24 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వీరు ఈ నెల 25 నుంచి నిజామాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ ఎంపిక కార్యక్రమంలో కబడ్డీ అసోషియేషన్ కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు కుమార్, జాయింట్ సెక్రెటరీ శ్రీకాంత్, రాజాగౌడ్, శశికుమార్, కోశాధికారి పి.రవి మధు, అంజనేయులు, శ్రీను, రేణుక, లాజర్, గీత, మీనా తదితరులు పాల్గొన్నారు. మంబోజిపల్లి గీతా స్కూల్‌కు విద్యార్థులు శివకుమార్, అభిలాష్, ప్రకాష్, వివేకవర్ధన్, సహస్ర, ప్రీతి ఎంపికైన వారిలో ఉన్నారు. వారిని పాఠశాల సెక్రటరీ రామాంజనేయులు, ప్రిన్సిపల్ మాధవి అభినందించారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్/నారాయణఖేడ్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపికలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. 300 మంది క్రీడాకారులు తమ ప్రతిభను కనబర్చారు. అండర్-14 బాలికల విభాగంలో 50 మంది, బాలుర విభాగంలో 100 మంది, అండర్-17 బాలికల విభాగంలో 50 మంది, బాలుర విభాగంలో వంద మంది ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ చంద్రశేఖర్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ విజయ్, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు క్రీడాకారులను అభినందించారు. నారాయణఖేడ్ మైనార్టీ బాలుర గురుకుల విద్యాలయం నుంచి రాష్ట్ర స్థాయికి షహనాజ్, షారుఖ్, ఇర్ఫాన్, ఫయాజ్ ఎంపికయ్యారు. వారిని ప్రిన్సిపల్ రాములతో పాటు క్రీడా ఉపాధ్యాయులు అజయ్‌సంతోష్, ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జితేందర్, విజయ్, రమేష్ అభినందించారు.

రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు వేదశ్రీ


జిల్లా స్థాయి సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు సంగారెడ్డి శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ విద్యార్థిని వేదశ్రీ ఎంపికయ్యారు. క్వాంటం యుగం ప్రారంభం- అవకాశం సవాళ్లు అనే అంశంపై సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో వేదశ్రీ మొదటి స్థానంలో నిలిచింది. ఈ నెల 18 న ఎస్‌సీఈఆర్‌టీలో జరిగే రాష్ట్రస్థాయి సెమినార్‌లో ఆమె పాల్గొననున్నారు. వేదశ్రీని డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలి

● నాణ్యమైన విత్తనోత్పత్తి చేసి ఇతర రైతులకు సరఫరా చేయాలి

● తోర్నాల రైతు విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్, శాస్త్రవేత్త డా.పల్లవి

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పరిశోధన కేంద్రాల్లో అభివృద్ధి చేసిన నాణ్యమైన విత్తనాలను యాజమాన్య పద్ధతుల్లో సాగు చేసి అధిక దిగుబడులను సాధించాలని తోర్నాల రైతు విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ పల్లవి రైతులకు సూచించారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలం చింతమడక, రాఘూవాపూర్, పుల్లూరు, పెద్దలింగారెడ్డిపల్లి గ్రామాల్లోని రైతుల భూముల్లో వరి, పెసర పంటలను ఆమె క్షేత్రతస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేసిన విత్తనాలను గ్రామంలో ముగ్గురు రైతులకు అందించామని తెలిపారు. రైతులు పండించిన పంటలు నేరుగా తోటి రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసే స్థాయికి ఎదగాలని చెప్పారు. తడులు, కలుపు నివారణ, ఎరువు, సస్యరక్షణ చర్యలను ఆమె రైతులకు వివరించారు.


పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరేష్, ఏఈవోలు భువన, ప్రదీప్త, సుమిత్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ భవనాలను ఆన్‌లైన్ చేయండి

● పదేళ్లవుతున్నా.. అసెస్‌మెంట్ ఎందుకు చేయలేదు

● సంగారెడ్డి డివిజనల్ పంచాయతీ అధికారి అనిత

పుల్‌కల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల భవనాలను కొలతలు చేపట్టి.. ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంగారెడ్డి డీఎల్పీవో అనిత పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని కోర్పోలు, సుల్తాన్‌పూర్, సరాఫ్‌పల్లి గ్రామాల శివారు భూముల్లో గత పదేళ్ల క్రితం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలను నిర్మించారు. పెద్ద పెద్ద భవనాలు నిర్మించినప్పటికీ నయా పైసా ఆస్తిపన్ను చెల్లించడం లేదంటూ కోర్పోలు గ్రామానికి చెందిన పలువురు యువకులు ప్రజావాణిలో కలెక్టర్ ప్రావీణ్యకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్పందించిన కలెక్టర్ విచారణ జరుపాల్సిందిగా జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించగా, సంగారెడ్డి డీఎల్పీవో అనిత బుధవారం కోర్పోలు, సుల్తాన్‌పూర్ గ్రామ పంచాయతీలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పర్యటించి, భవన నిర్మాణాలను పరిశీలించారు. కేవలం సుల్తాన్‌పూర్ పంచాయతీకి ఏడాదికి రూ.6.90 లక్షలు చెల్లిస్తుండగా, కోర్పోలు, సరాఫ్‌పల్లి పంచాయతీలకు నయా పైసా ఆస్తిపన్ను చెల్లింపు చేయడం లేదు. అయితే, ఏ గ్రామ శివారులో ఎంత భూమిని తీసుకున్నారో గుర్తించి, ఎన్ని భవనాలు నిర్మించారో కొలతలు చేపట్టాలని సూచించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కలసికట్టుగా జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల భవనాలను పరిశీలించి కొలతలు చేపట్టాలన్నారు.

కోర్టు కోసం 25న భవనం అప్పగింత

● తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తూప్రాన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో కోర్టు ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఈనెల 25న కోర్టు కోసం మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనం అప్పగిస్తున్నట్లు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. 11న 'ఆంధ్రజ్యోతి'లో 'తూప్రాన్‌లో కోర్టు ఎప్పుడు?' కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. బుధవారం తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఒక ప్రకటన విడుదల చేస్తూ తూప్రాన్‌కు గతంలోనే కోర్టు మంజూరైందని, వసతి లభించకపోవడంతో కోర్టు ప్రారంభం కాలేదన్నారు. జిల్లా న్యాయాధికారి పలు భవనాలు పరిశీలించగా, ఎంపీడీవో కార్యాలయం ఉపయోగించేందుకు ఖరారు చేసినట్లు వివరించారు. నిర్మాణంలో ఉన్న డివిజన్ కార్యాలయాల (ఐడీవోసీ) భవనం పూర్తి కాలేదని, పూర్తయితే కార్యాలయాలు అందులోకి మారుతాయని కోర్టు అధికారులకు వివరించినట్లు తెలిపారు. కోర్టుకు ఎంపీడీవో భవనం కావాలని కోరడంతో మంత్రి దామోదర్ ఆదేశాలతో ఐడీవోసీ భవనంలో గదులను తాత్కాలికంగా పూర్తి చేసి, అందులోకి ఎంపీడీవో కార్యాలయం షిఫ్టు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కోర్టు అత్యవసరంగా ఏర్పాటు చేయాల్సి ఉన్నందున 22లోపు ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాలు షిఫ్టు చేస్తున్నట్లు వివరించారు. 25న ఎంపీడీవో కార్యాలయ భవనం కోర్టు అధికారులకు అప్పగిస్తామని తెలిపారు.

సింగూరుకు తగ్గని వరద ప్రవాహం

● ఇన్‌ఫ్లో 47,695.. ఔట్‌ఫ్లో 50,751 క్యూసెక్కులు

● ఆరు క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల


పుల్‌కల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం తగ్గడం లేదు. ఎగువన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి ప్రాజెక్టులో చేరుతూనే ఉన్నది. బుధవారం ఆరు క్రస్ట్ గేట్ల ద్వారా వరద నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 47,695, ఔట్ ఫ్లో 50,751 క్యూసెక్కులుగా నమోదయింది. ఆరు క్రస్ట్ గేట్ల ద్వారా 48,242 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేట్ గుండా 1,849 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 120 క్యూసెక్కులు, హెచ్ఎండబ్ల్యూఎస్‌కు 80, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, 390 క్యూసెక్కులు ఆవిరి అవుతుండగా మొత్తం ఔట్‌ఫ్లో 50,751 క్యూసెక్కులుగా నమోదయింది. బుధవారం రాత్రి అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులో 520.595 మీటర్లకు 16.870 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. మంజీర రిజర్వాయర్ వద్ద నాలుగు క్రస్ట్‌గేట్లు, ఒక స్కవర్ గేట్‌ను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లుగానే ఘనపురం ప్రాజెక్టుకు వదులుతున్నారు.

ఎమ్మెల్సీ కవితకు విద్యాధరి క్షేత్ర నవరాత్రుల ఆహ్వానం

వర్గల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వర్గల్ విద్యాధరి క్షేత్రంలో జరగనున్న అమ్మవారి శరన్నవరాత్రోవాలకు హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యుడు ఎమ్మెల్సీ కవితకు బుధవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. విద్యాధరి క్షేత్రంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 1 వరకు సరస్వతీ అమ్మవారి శరన్నవరాత్రోత్సవాలు జరగనున్నారు. కార్యక్రమంలో నాచగిరి లక్ష్మీనృసింహస్వామి ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి, ఆలయ కమిటీ సభ్యులు టేకులపల్లి బాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాలుయాదవ్ తదితరులు ఉన్నారు. దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు.


ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ ప్రతినిధులు

ఇక వర్షాలు చాలు స్వామి..



మెదక్ జిల్లాలో భారీ వర్షాలు పడుతు రైతులతో పాటు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నందున ఇక వర్షాలు చాలంటూ నర్సాపూర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి, కాంగ్రెస్ నాయకుడు పైడిశ్రీధర్‌గుప్తా స్థానిక మల్లికార్జునస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

-నర్సాపూర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ

పటాన్‌చెరు సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పటాన్ చెరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు బుధవారం డీఎస్పీ ప్రభాకర్‌తో కలిసి పోలీస్‌స్టేషన్‌లో వివరాలు సేకరిం చారు. ఇటీవల నమోదయిన కేసులపై ఆరా తీశారు. సైబర్ క్రైమ్‌కు చెందిన కేసుల వివ రాలు చూశారు. రోజువారి కేసుల నమోదుపై సీఐ వినాయకరెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

టెలికం అడ్వయిజరీ కమిటీ సభ్యుడుగా న్యాయవాది నర్సింగ్‌రావు

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): బీఎస్ఎన్ఎల్ టెలికం అడ్వయిజరీ కమిటీ సభ్యుడుగా సంగారెడ్డి పట్టణానికి చెందిన న్యాయవాది ఎ.నర్సింగ్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ బుధవారం నర్సింగ్‌రావుకు అందజేశారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరాథోడ్



సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్ర జ్యోతి): స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస రాథోడ్, ప్రధాన కార్యదర్శిగా సాబేర్‌అలీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానంద గౌడ్ బుధవారం వారికి నియామకపత్రాలు అందజేశారు. అనంతరం నిర్వహించిన జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు భీమనాథుని రవి, ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్‌లు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన రూల్ ప్రకారం అందరూ ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణులు కావాలనే సహేతుకత సరికాదన్నారు.

రుణాల మంజూరులో జాప్యంపై నిరసన

రేగోడు సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాల కోసం ఇబ్బందులు పడుతున్నామని రైతులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. రేగోడు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో సిబ్బంది కొరత, ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో వ్యవసాయ రుణాల రెన్యూవల్ కోసం రెండు మూడు రోజులు బ్యాంకు చుట్టూ తిరుగుతున్నామని అన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ

చేగుంట ,సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా చేగుంట మండలం పొలంపల్లి కామ్రేడ్ కేవల్ కిషన్ సమాధి వద్ద సీపీఎం పార్టీ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం కేవల్ కిషన్, ఆనందమ్మ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అడువయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం భారత దేశ చరిత్రలో మర్చిపోలేని ఘట్టంగా పేర్కొన్నారు.కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మెదక్ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లేశం, నాయకులు అజయ్, సత్యం, యాదగిరి ,దర్గా, షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

పుల్‌కల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పుట్టగొడుగుల పెంపకం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని ఎంపీడీవో ఆనందమేరీ అన్నారు. మండల కేంద్రమైన పుల్కల్‌లోని ఐకేపీ కార్యాయంలో హైదరాబాద్‌లోని దూలపల్లి అటవీ జీవవైవిధ్య సంస్థ సహకారంతో బుధవారం మహిళలకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం పుట్టగొడుగులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నదని, ఇది ఆరోగ్యకరమైన ఆహారమన్నారు. పుట్టగొడుగులను ఎలా పెంచాలి, వాటికి సంబంధించిన శిక్షణ, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

మునిపల్లి, సెప్టెంబర్17 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, యువత బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పైడిగుమ్మల్ వీరన్న, మల్లన్న, తుమ్మలపల్లి పెద్ద పథ్వీరాజ్, మల్లారెడ్డి, సతీష్ కుమార్ తదితరులు ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట నర్సింహ్మారెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు అయ్యప్ప స్వామి, పాల్గొన్నారు.



ఖేడ్‌లో క్యాంపు కార్యాలయం వద్ద జెండా ఎగుర వేసిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి



జహీరాబాద్‌లోని తహసీల్ కార్యాలయంలో జెండావందనం చేస్తున్న అధికారులు



కంది తహసీల్ కార్యాలయంలో జెండావందనం చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ప్రజాపాలదినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్, మండలప్రజాపరిషత్, తహసీల్ కార్యాలయాలతో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాల వద్ద సంబంధిత అధికారులు జాతీయ జెండాలను ఎగురవేసి, జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా రాచరికపు వ్యవస్థ నుంచి ప్రజాపాలన కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన అమరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు.

- న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి)



ఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న సబ్ కలెక్టర్ ఉమా హారతి



పెద్దశంకరంపేటలో తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఎగుర వేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్



పాపన్నపేట రెవెన్యూ కార్యాలయం జెండా ఎగరవేసి జాతీయ గీతం ఆలపిస్తున్న తహసీల్దార్, అధికారులు

వేడుకలకు దూరంగా..



అల్లాదుర్గం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా బుధవారం అల్లాదుర్గంలోని ప్రభుత్వ కార్యాలయాలన్ని త్రివర్ణ పతాకాలతో రెపరెపలాడుతుంటే నీటిపారుదల శాఖ ఉప కేంద్రం బోసిపోయింది. సంబంధిత అధికారులు వేడుకలను నిర్వహించకుండా దూరంగా ఉండటం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై సంబంధిత ఏఈ వైష్ణవిని ఫోన్‌లో సంప్రదించగా తాము డివిజన్ కార్యాలయంలో ఈ వేడుకలను జరుపుకుంటున్నామని తెలిపారు. సబ్ డివిజన్ కార్యాలయంలో వేడుకలను నిర్వహించకపోవడమేంటని విమర్శలు వెల్లువెత్తాయి.



తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఆర్డీవో

బీజేపీ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం



కోహీర్: దిగ్వాల్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద తెలంగాణ విమోచన దినోత్సవం



మెదక్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద జెండా ఎగురవేసి వందనం చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ ఆధ్వర్యంలో సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో తెలంగాణా విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆనాటి భారత ఉప ప్రధాని ఉక్కుమనిషి సర్ధార్ వల్లభాయ్ పటేల్ చొరవతోనే నేడు తెలంగాణ ప్రజలు స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తున్నామని గుర్తు చేశారు. నిజాంనిరంకుశ పాలనకు ఎదురొడ్డి పోరాడిన అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. పలు చోట్ల సర్ధార్ వల్లబయ్ పటేల్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

- న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి)

ఆలస్యంగా జెండా ఆవిష్కరణ

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దినోత్సం సందర్భంగా వివిధ శాఖల కార్యాలయాల వద్ద ఉదయం 9 గంటల సమయానికి అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. అయితే తహసీల్దార్ మాలతి సమయ పాలన లోపంతో 9.45 నిమిషాలకు తహసీల్ కార్యాలయం వద్ద జెండా ఎగురవేశారు. తహసీల్దార్ రాకకోసం రెవెన్యూ సిబ్బంది ఎదురు చూడాల్సివచ్చింది. తహసీల్దార్ మాలతి సమయానికి హాజరు కాకపోవడంతో పలువురు రాజకీయ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ జయంతి వేడుకలు



మెదక్ అర్బన్: కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతి వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ తదితరులు



పాపన్నపేటలో ఘనంగా విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు



గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని రామ్ నగర్ కాలనీలో విశ్వకర్మ జయంతి పూజలు

విశ్వకర్మ జయంతి వేడుకలను మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు పరిశ్రమల్లో, వివిధ సంఘాల ఆధ్వర్యంలో విశ్వకర్మ భగవానుడి చిత్రపటాన్ని ఏర్పాటు చేసుకుని హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా మండలకేంద్రాల్లో విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపులు నిర్వహించారు. విశ్వకర్మ చరిత్రను భవిష్యత్ తరాలకి తెలియపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి)

కార్పొరేట్ వైద్యానికి సీఎంఆర్ఎఫ్



చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న నీలం మధు

పటాన్‌చెరు సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కార్పొరేట్ అందించడానికి సీఎం సహాయ నిధి ప్రయోజనకరంగా మారిందని కాంగ్రెస్‌పార్టీ నాయకుడు నీలం మధు పేర్కొన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో ఇస్నాపూర్‌కు చెందిన సుజాత, కరణం మంజుల, చిట్కుల్ గ్రామస్థుడు వెంకటేష్, ఐడీఏబొల్లారం గ్రామస్థుడు లక్ష్మణ్‌రావులకు రూ.60వేలు చొప్పున, చిట్కుల్ గ్రామస్థుడు నవీన్‌కు రూ.30వేలు, గుమ్మడిదల గ్రామస్థుడు తుడుం రాజమ్మ రూ.55వేలు చొప్పున మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇస్నాపూర్ మాజీ సర్పంచ్ శ్రీశైలం, మాజీ కౌన్సిలర్ మహేందర్‌రెడ్డి, దానయ్య, అశోక్, శ్రీనివాస్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

అందుబాటులోకి మరిన్ని వైద్యసేవలు



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

జహీరాబాద్, సెప్టెంబరు17ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలో ఏర్పాటుచేసిన సిటీజెన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెడికవర్ సహకారంతో రోగుల సౌకర్యార్థం మరిన్ని వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావడమైందని వైద్యులు విక్రంకిషోర్‌రెడ్డి, ఆరాధన్‌రెడ్డి, నరిన్‌జాన్, మేనేజర్ వెంకటాద్రీలు పేర్కొన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లు, పర్యావరణమార్పు తదితరాలు వెరసి ప్రజలు వివిధరకాల వ్యాధులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రోగులకు మెరుగైన వైద్యసేవలందించేందుకై ఆస్పత్రిలో మరిన్ని చికిత్సలు చేస్తున్నట్లు వారు వివరించారు. పక్షవాతం, నరాలవ్యాధులతో బాధపడేవారికి ప్రత్యేకచికిత్సలు చేస్తున్నామని, ఆస్పత్రికి వచ్చిన కొన్ని గంటల వ్యవధిలో కోలుకుంటున్నారన్నారు.ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవలో అందరు భాగస్వాములు కావాలి



అల్గోల్‌లో మాట్లాడుతున్న సీనియర్‌సివిల్‌జడ్జి కవితాదేవి

జహీరాబాద్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): సమాజసేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మండల లీగల్‌సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్‌జడ్జి కవితాదేవి పేర్కొన్నారు. పట్టణంలోని ఆచార్య డిగ్రీకళాశాల ఆధ్వర్యంలో అల్గోల్ గ్రామంలో గత మూడురోజులుగా ఎన్ఎస్ఎస్ శిబిరం కొనసాగుతున్నది. బుధవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ సమాజానికి సేవచేయాలనే ఆలోచన ప్రతిఒక్కరిలో ఉండాలన్నారు. అలాంటప్పుడే సమాజం బాగుంటుందన్నారు. వారంరోజుల పాటు గ్రామాల్లో ప్రజలతో కలిసి ఉండడం వల్ల గ్రామీణప్రాంత పరిస్థితులు, ప్రజలజీవన విధానం తెలుసుకోవచ్చని, ఈ శిబిరం ద్వారా విద్యార్థులకు మరింత అవగాహన ఏర్పడుతుందన్నారు. అనంతరం పట్టణ సీఐ శివలింగం మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ శిబిరాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు క్షేత్రస్థాయి సమస్యలపై మరింత అవగాహన పెరుగుతుందన్నారు. సైబర్‌నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాలప్రిన్సిపాల్ డా.చింతల హరికుమార్, డైరెక్టర్లు వెంకట్ రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో అభివృద్ధికి నిధులు

రామచంద్రాపురం టౌన్ సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రత్యేకంగా నిధులు మంజూరయ్యాయని కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం భారతీనగర్ డివిజన్ పరిధి ఎల్ఐజీ, మ్యాక్‌సొసైటి కాలనీల్లో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మ్యాక్‌సొసైటి కాలనీలో వరదకాలువ నిర్మాణం చేపట్టడానికి ప్రతిపాదన పంపామన్నారు.





జహీరాబాద్‌లో, సంగారెడ్డి బీజేపీ కార్యాలయంలో రక్తదానం చేస్తున్న బీజేపీ నాయకులు

రక్తదాన శిబిరాలు.. సేవా కార్యక్రమాలు

ప్రధాని మోదీ జన్మదినాన్ని బుధవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో బీజేపీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నాయి. ఈ సందర్భంగా పట్టణాలు, మండలకేంద్రాల్లో బీజేపీ నాయకులు రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తదానం చేశారు. ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ప్రధాని మోదీ క్షేమాన్ని కోరుతూ ఆయన పేరిట పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బర్త్‌డే కేక్‌లను కట్ చేసి పంపిణీ చేశారు. పలుచోట్ల పేద మహిళలకు చీరలు పంపిణీ చేయగా, మరికొన్ని చోట్ల కార్మికులను దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి మోదీ అని కొనియాడారు.

- న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి)



తూప్రాన్‌లో ఆసుపత్రి హౌస్‌కీపింగ్ సిబ్బందికి చీరల పంపిణీ

అమ్మో.. సంగారెడ్డి జైలు

(5వ పేజీ తరువాయి)

కూరగాయలు విక్రయించడం చర్చనీయంశంగా మారింది. అంతకుముందుకు బ్యాంకుకు వెళ్లేందుకు అంబులెన్స్‌ను వినియోగించగా దానిని ఓ ఖైదీ డ్రైవింగ్ చేయడం గమనార్హం. ప్రతీ నెలా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు జైలును ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. సౌకర్యాలను పరిశీలించడంతో పాటు ఖైదీలతో సమావేశమై సమస్యలుంటే చెప్పుకోమని భరోసా ఇస్తున్నారు. కానీ, జైలు అధికారులకు భయపడిన ఖైదీలు వారి ముందు నోరు విప్పటం లేదు. ఈ పరిస్థితులను చూస్తుంటే ఖైదీల పట్ల జైలు అధికారులు కఠినంగా వ్యవహరిస్తురా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

ఖైదీలు మింగింది పెన్నుమూత

సంగారెడ్డి జైలులో ఇద్దరు ఖైదీలు సీసా పెంకులు మింగారనేది అవాస్తవం. జిల్లా ఆస్పత్రిలో ఎక్స్‌రే తీయగా ఒక ఖైదీ పెన్నుమూత మింగినట్లు తేలింది. ఇంకో ఖైదీ సీసా పెంకులు మింగానని అబద్ధం చెప్పాడు. చికిత్స తర్వాత వారిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఇప్పుడు వారు బాగానే ఉన్నారు. బెయిల్ కోసం ఇలా నాటకమాడారు. జైలులో ఖైదీలకు ఎలాంటి ఇబ్బందులు లేవు.

-కళాసాగర్, సంగారెడ్డి జైలు సూపరింటెండెంట్

ఇసుక మాఫియా అనేది ఉండొద్దనే ఇసుక బజార్లు

● జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వివేక వెంకటస్వామి

నర్సాపూర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇసుక మాఫియా రాష్ట్రంలో ఉండకూడదనే ఉద్దేశంతో, లబ్దిదారులకు తక్కువ ధరకు అందించడానికే ప్రతీ నియోజకవర్గంలో ఇసుక బజార్లు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని మార్కెట్ యార్డులో టీజీఎండీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక బజారును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడే నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన ఆధునిక శ్మశానవాటికను, ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మెదక్ జిల్లాలో పదివేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని ప్రస్తుతం నిర్మాణ పనులు ఆయా దశలలో కొనసాగుతున్నాయన్నారు. బేస్మెట్ వరకు పూర్తయినవారికి వెంటనే రూ.లక్ష వారి ఖాతాలో పడ్డాయన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపుకలెక్టర్ నగేష్, గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ సుహాసినిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఆర్డీవో మహిపాల్, డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు రాజుయాదవ్, వెంకట్రామ్‌రెడ్డిలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి రూ.20 కోట్లు

● హ్యామ్ కింద రూ.300 కోట్లతో ప్రతిపాదనలు: ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సెంట్రల్ రిజర్వు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్(సీఆర్ఐఎఫ్) నిధులు రూ.20 కోట్లతో ఎన్‌హెచ్161బీ అనుసంధానంతో మూడు గుంటల నుంచి వయా సంజీవన్‌రావుపేట్, కడ్పల్, సిర్గాపూర్, చాప్టా.కె క్రాస్ రోడ్ వరకు రహదారి అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కృషితో కేంద్రమంత్రి నితీన్ గడ్కరి నిధులు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రూ.200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను అనుసంధానిస్తూ నాలుగు రోడ్లకు ప్రతిపాదించినట్లు ఆయన తెలిపారు. హ్యామ్‌కింద రూ.300 కోట్లతో రహదారుల కోసం ప్రతిపాదించినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు యాదవరెడ్డి, నర్సింలు, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో 'గీతా' విద్యార్థుల సత్తా



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో మంబోజిపల్లి గీతా స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. మెదక్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పాపన్నపేటలో నిర్వహించిన పోటీల్లో అండర్-16 బాలబాలికల విభాగంలో గీతా విద్యార్థులు శివకుమార్, అభిలాష్, ప్రకాష్, వివేకవర్ధన్, సహస్ర, ప్రీతి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల సెక్రటరీ రామాంజనేయులు, ప్రిన్సిపాల్ మాధవి అభినందించారు.

మెదక్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సిటీ స్కాన్



సిటీ స్కాన్ మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) మెదక్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రూ.2.6 కోట్లతో ఏర్పాటు చేసిన నూతన సిటీ స్కాన్ కేంద్రాన్ని బుధవారం మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు ప్రారంభించారు, ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటుంబం కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సిటీ స్కాన్ యంత్రం ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, ఆర్థిక భారం కూడా తగ్గనుందన్నారు. నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాలలో మరింత నాణ్యమైన సేవలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనంతరం రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరెండెంట్ సునీతాదేవి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ కర్త డాక్టర్ శివదయాల్, డాక్టర్ ప్రియదర్శిని పాథాలజిస్ట్, మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ చంద్రపాల్, నాయకులు ముత్యం గౌడ్,బొజ్జ పవన్, పరశురాం గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత వైద్యం



మహిళల ఆరోగ్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం టౌన్ సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ దవాఖానాల్లో మహిళలకు ప్రత్యేకంగా ఉచిత వైద్యాన్ని అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని కార్పొరేటర్ పుష్పానగేష్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రామచంద్రాపురం ప్రాథమిక వైద్య ఆరోగ్యకేంద్రంలో ఉచిత మహిళా వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. వచ్చే నెల 2వ తేదీ వరకు మహిళలకు పూర్తి స్థాయి వైద్యాన్ని అందిందించేలా 15రోజుల పాటు శిబిరం నిర్వహిస్తారన్నారు.

మినీభారత్ బండ్లగూడలో సౌకర్యాలు

పటాన్‌చెరు సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ మెట్టుకు మార్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు బుధవారం పటాన్‌చెరు డివిజన్ పరిధి బండ్లగూడ గ్రామానికి సందర్శించి మురుగు సమస్యలపై ఫిర్యాదు చేసిన వారితో మాట్లాడారు. వ్యర్థాలతో కూడిన మురుగునీటి ప్రవాహాన్ని పరిశీలించారు. పరిశ్రమల వారు వర్షం మాటున వదులుతున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పటాన్‌చెరు ఆరోగ్యకేంద్రంలో స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలానే యాదవుల శ్మశానవాటికలో సీసీ ప్లాట్‌ఫాం నిర్మాణపనులు పరిశీలించారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ పవన్, రామ్‌కీ విజయ్, వైద్య ఆరోగ్య అధికారి నేత్రావతి, యశోద, హంసరాణి, కవిత, అపర్ణ, పుష్పలత, భరత్ కుమార్ తదితరులు ఉన్నారు.

పానాది రోడ్డు సర్వేను అడ్డుకున్న రైతులు

శివ్వంపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) ఏళ్ల నాటి పానాది రోడ్డును తొలగించేందుకు సర్వే నిర్వహించగా రైతులు అడ్డుకుని ఆందోళనకు దిగారు. ఈ ఘటన బుధవారం చిన్న గొట్టిముక్ల గ్రామంలో చోటుచేసుకుంది. మండలంలోని చిన్నగొట్టి ముక్ల గ్రామంలో నిరుపేదలకు పంపిణీ చేసిన ప్రభుత్వ భూమిలోకి వెళ్లే ఏళ్ల నాటి పానాది రోడ్డును కొందరు మంగళవారం రోడ్డును తొలగించేందుకు సర్వే చేయించడానికి వెళ్లిన రెవెన్యూ అధికారులను రైతులు అడ్డుకున్నారు. రోడ్డును తొలగిస్తే ఊరుకునేది లేదని రైతులు రెవెన్యూ అధికారులను అడ్డుకున్నారు. సర్వే చేసి రోడ్‌ను తొలగిస్తే తమకు దారి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

శక్తివంతమైన కుటుంబానికి మూలం ఆరోగ్య మహిళ

గుమ్మడిదల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన మహిళే శక్తివంతమైన కుటుంబానికి మూలం అని ప్రభుత్వ ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ మధుకర్ పేర్కొన్నారు. బుధవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని పల్లె దవఖాన వద్ద ఘనంగా స్వస్థ నారీ, శక్తివంత కుటుంబ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మధుకర్ మాట్లాడుతూ మహిళ ఆరోగ్యం బలంగా ఉంటే కుటుంబం, సమాజం కూడా శక్తివంతంగా మారుతుందన్నారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడం ఈ అభియాన్ ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. మహిళ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే అనారోగ్య సమస్యలతో పాటు కుటుంబ ఆర్థిక స్థితి కూడా దెబ్బతింటుందని డాక్టర్ మధుకర్ తెలిపారు. అందుకే ప్రతీ ఇంట్లో మహిళ ఆరోగ్యంపై మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాస్ రావు, ఏఎన్ఎం స్వరూప ఆరోగ్య సిబ్బంది, స్థానిక ప్రజల పాల్గొన్నారు